# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-04-2024** **సమయం : 6.45 గంటలు**

## ముఖ్యాంశాలు

1. **దేశ సమగ్రాభివృద్ధే తమ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ ముఖ్య నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
2. **ఎన్నికల సమయంలో దేశవ్యాప్తంగా 4 వేల 658 కోట్ల రూపాయల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని భారత ఎన్నికల సంఘం తెలిపింది.**
3. **ఎన్నికలు పారదర్శకంగా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు మరింత సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిర్ణయించాయి.**
4. **తెలంగాణాలో ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.**
5. **ప్రముఖ సంఘ సంస్కర్త, ఆధునిక సాహిత్య యుగ సంఘ వైతాళికులు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఈరోజు.**
6. **దేశంలో ఈ సంవత్సరం సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.**

=============================

సార్వత్రిక ఎన్నికల తర్వాత కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే దేశాభివృద్ధి కోసం తమ వద్ద పెద్ద ప్రణాళికలు ఉన్నాయని ఆ పార్టీ ముఖ్య నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. నిన్న ఆయన ఓ ముఖాముఖిలో మాట్లాడుతూ.. 2047 నాటికి భారత్ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి పెట్టుకున్న లక్ష్యాల గురించి వివరించారు. ఎలక్టోరల్ బాండ్ల దగ్గర నుంచి భారతదేశంలో టెస్లా కార్ల వరకు అనేక అంశాల గురించి మోదీ ప్రస్తావించారు. తాను, తన ప్రభుత్వం ఏ ఒక్కరినీ లక్ష్యంగా చేసుకుని నిర్ణయాలు తీసుకోబోదని.. దేశ సమగ్రాభివృద్ధే తమ లక్ష్యమని నరేంద్ర మోదీ స్పష్టంచేస్తూ...

..వాయిస్ ...32 సెకన్లు

-------------------------

ఎన్నికల సమయంలో దేశవ్యాప్తంగా 4 వేల 658 కోట్ల రూపాయల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని భారత ఎన్నికల సంఘం తెలిపింది. ఇందులో 395 కోట్ల 39 లక్షల రూపాయల నగదు, 489 కోట్ల 31 లక్షల

రూపాయల విలువైన మద్యం, 2 వేల 68 కోట్ల 85 లక్షల రూపాయల విలువైన మాదకద్రవ్యాలు, 562 కోట్ల విలువైన లోహాలు, ఓటర్లకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచిన వెయ్యీ 142 కోట్ల 49 లక్షల రూపాయల విలువైన కానుకలు ఉన్నాయని పేర్కొంది. ఇంత పెద్ద మొత్తంలో సొత్తు స్వాధీనం చేసుకోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని ప్రకటించింది.

---------------------------

ఎన్నికలు పారదర్శకంగా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు మరింత సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిర్ణయించాయి. తెలుగు రాష్ట్రాల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై హైదరాబాద్‌లో రెండు రాష్ట్రాల ఉన్నతాధికారుల సమన్వయ సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో శాసన సభ, లోక్ సభ స్థానాలకు మే 13వ తేదీన ఒకేసారి ఎన్నికలు జరగ నున్నందున ఎన్నికలను స్వేచ్ఛగా శాంతి యుతంగా నిర్వహించేందుకు తెలంగాణాతో కలిసి పూర్తి స్థాయి సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. అక్రమ మద్యం,గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిరోధానికి ఆపరేషన్ పరివర్తన పేరిట చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫాలితాలను ఇచ్చిందని వెల్లడించారు. శాంతి కుమారి మాట్లాడుతూ.. మే 13వ తేదీన పోలింగ్ సక్రమంగా జరిగేందుకు ఇప్పటికే సరిహద్దు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించామని తెలిపారు.

---------------------------

మార్కెట్ యార్డులకు తీసుకువచ్చే ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా చర్యలు చేపట్టాలని తెలంగాణా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మామిడి పండ్ల పక్వానికి కార్బైడ్ ఉపయోగించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డుల్లో నాణ్యతా ప్రమాణాల ప్రకారం మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిపై రాయితో దాడి చేసిన ఘటనపై దర్యాప్తు వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి.. సీఈవో ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా, ఇన్స్‌పెక్టర్ జనరల్ రవిప్రకాశ్‌తో ఆయన దాడి ఘటనపై సమీక్ష నిర్వహించారు. జగన్మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్రలో పటిష్ట బందోబస్తు ఉన్నప్పటికీ.. ఎలా దాడి చేయగలిగారని ముఖేష్ కుమార్ మీనా ప్రశ్నించారు. ఈ ఘటనలో ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకున్నామని అధికారులు ఆయనకు వివరించగా.. దర్యాప్తు వేగవంతం చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఈవో ఆదేశించారు. ప్రముఖుల పర్యటనలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్పష్టంచేశారు.

---------------------------

దేశంలో ఈ సంవత్సరం సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే వచ్చే రుతుపవనాల సీజన్‌లో 106 శాతం వర్షపాతం నమోదు

కావచ్చుని తెలిపింది. వచ్చే సీజన్‌లో 87 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేసింది. లానినా పరిస్థితులు వర్షాలకు అనుకూలంగా ఉండడం వల్ల ఆగస్టు-సెప్టెంబరు నాటికి ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చుని వెల్లడించింది. వాయవ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. జూన్ నాటికి ఎల్‌నినో బలహీనపడనుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

---------------------------

ప్రముఖ సంఘ సంస్కర్త, ఆధునిక సాహిత్య యుగ సంఘ వైతాళికులు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఈరోజు. 1848వ సంవత్సరం ఏప్రిల్ 16వ తేదీన రాజమండ్రిలో జన్మించిన ఆయన మహా కవి కాళిదాసు రచించిన “అభిజ్ఞాన శాకుంతలం” నాటకాన్ని తెలుగులో అనువదించారు. ఆయన రాసిన ఆంధ్ర కవుల చరిత్ర, స్వీయ చరిత్ర బహుళ ప్రచారం పొందాయి. హిత కారిణి సమాజం ద్వారా ఎన్నో నాటకాలను రాసి ప్రదర్శించారు. 1881 సంవత్సరంలో మొదటి వితంతు వివాహం జరిపించారు. 1919 సంవత్సరం మే 27వ తేదీన మద్రాసులో పరమపదించారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007 నుంచి తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో విద్య, వైద్య రంగాల్లో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి తెలిపారు. కృష్ణాజిల్లా గుడివాడలో నిన్న జరిగిన మేమంతా సిద్ధం సభలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించి సున్నా వడ్డీకే రుణాలు అందించామని పేర్కొన్నారు. సహకార రంగంలో అమూల్ సంస్థను భాగస్వామిని చేసి పాడి రైతులకు మేలు చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో సీపోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, విమానాశ్రయాలు, 3 పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని జగన్మోహన్ రెడ్డి వివరించారు.

---------------------------

ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నీరు, రహదారులు, విద్యాలయాలు అవసరమని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా రాజాం, శ్రీకాకుళం జిల్లా పలాసలో నిన్న జరిగిన ప్రజాగళం సభల్లో ఆయన మాట్లాడారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి 2 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని.. ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులకు 16 వేల కోట్ల రూపాయలు వెచ్చించామని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే రవాణా మార్గాలు మెరుగుపడాలని భావించి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన భూములు సేకరించామని చంద్రబాబునాయుడు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన ఐదేళ్లలో ఏడుసార్లు విద్యుత్తు, అయిదుసార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ న్యాయయాత్రలో భాగంగా నిన్న ఆమె చిత్తూరు జిల్లా కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తే ఒక్కో నియోజకవర్గానికి వంద పరిశ్రమలు వచ్చేవని పేర్కొన్నారు. సహకార చక్కెర

కర్మాగారాలు తెరిపిస్తానని గత ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే సహకార చక్కెర కర్మాగారాలను పునఃప్రారంభిస్తామని.. రైతులకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని షర్మిల హామీ ఇచ్చారు.

---------------------------

రెండు తెలుగు రాష్ట్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో నిన్న 38 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 75 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 43.9 డిగ్రీలు, నంద్యాల జిల్లా బనగానపల్లెలో 43.3, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 43.1, పల్నాడు జిల్లా మాచెర్ల, విజయనగరం జిల్లా రాజాంలలో 42.8, అనకాపల్లి జిల్లా గాదిరాయిలో 42.7 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ రోజు 63 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 130 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణసంస్థ తెలిపింది. అటు తెలంగాణలోనూ.. నిన్నటి కంటే ఈ రోజు, రేపు రెండు నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం సూచించింది.

======================